ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్కార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 314 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

సోమవారం16 జూన్ 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

బీసీ, ఓబీసీ సర్టిఫికెట్లకు మధ్య తేడాలేంటి?

ఏది ఎక్కడ ఉపయోగపడుతుందో తెలుసా?

జూన్ 16 (రిపబ్లిక్ న్యూస్): ఉన్నత విద్యకు, పోటీ పరీక్షల్లో కీలకంగా మారుతున్న బీసీ, ఓబీసీ ధ్రువపత్రాలు - కేంద్రప్రభుత్వం గుర్తించిన వెనుకబడిన కులాల జాబితాలో ఉన్నవారికి మాత్రమే ఓబీసీ జారీ చేస్తారు - బీసీ ధ్రువపత్రం కేవలం రాష్ట్రానికే పరిమితం బీసీ, ఓబీసీ ధ్రువీకరణ పత్రాల గురించి తరచూ వింటూనే ఉంటాం. ఉన్నత విద్యకు, పోటీ పరీక్షల సమయంలో ఇవి అవసరమవుతుంటాయి. ఈ రెండూ వేర్వేరు కాగా, సరైన అవగాహన లేక బీసీ, ఓబీసీ ఒక్కటే అనుకుంటారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా గుర్తించిన వెనకబడిన కులాల జాబితాలో ఉన్నటువంటి వారందరినీ ఓబీసీ (అదర్ బ్యాక్వర్డ్ క్లాసెస్) కులాలకు చెందినవారిగా పరిగణిస్తారు. వారికి మాత్రమే ఓబీసీ ధ్రువీకరణపత్రం జారీ చేస్తారు. బీసీ ధ్రువీకరణ పత్రం కేవలం రాష్ట్రానికే పరిమితమై ఉంటుంది ఉంటుంది.

ప్రకటన వెలువడే ముందే : జేఈఈ, నీట్, యూసీజీ సీట్ల భర్తీకి, ఉద్యోగాల నియామకాలకు ఓబీసీ(అదర్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్) ధ్రువీకరణ పత్రం అవసరం అవుతుంది. స్థానిక తహసీల్దార్లు జారీ చేసే ఈ ధ్రువీకరణ పత్రాలు ఏడాది మాత్రమే చెల్లుబాటవుతాయి. ఏడాది దాటితే వాటిని అంగీకరించడం లేదు. అందుకే విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త ఓబీసీ ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాల్సి ఉంటుంది. కాగా కొన్నింటి నోటిఫికేషన్లు వచ్చే ముందే వీటిని తీసుకోవాల్సి ఉంటుంది. ఓబీసీ వర్గానికి చెందిన పది, ఇంటర్ చదివే విద్యార్థులు ముందుగానే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. స్కాలర్‌షిప్ దరఖాస్తుకు ఇవి ఉపయోగపడతాయి.

మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలి: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించింది. కేంద్రం ప్రభుత్వం మాత్రం అందరినీ కలిపి ఓబీసీలుగా గుర్తిస్తుంది. కాగా ఈ ధ్రువీకరణ పత్రానికి అభ్యర్థులు మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్లికేషన్‌లో అభ్యర్థి పూర్తి వివరాలతో పాటు తల్లిదండ్రుల వార్షికాదాయం తదితర వివరాలు నమోదు చేసి, ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తు చేసుకోవాలి. రూ.8 లక్షల్లోపు ఆదాయం ఉంటే ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), తహసీల్దార్ విచారణ చేసి అర్హత ఉంటే జారీ చేస్తారు.

రెండోసారి కుల, ఆదాయ ధ్రువపత్రాలు తీసుకోవచ్చు: క్యాస్ట్ ఇన్‌కమ్‌కు ఒక్కసారి అప్లై చేస్తే ఎన్ని సార్లైనా తీసుకోవచ్చు. తొలిసారి తీసుకున్న క్యాస్ట్, ఇన్‌కమ్ ధ్రువపత్రాలకు సంబంధించిన రసీదుపై అప్లికేషన్ నంబర్ ఉంటుంది. రెండో సారి అదే డాక్యుమెంట్ అవసరం అయినప్పుడు మీ-సేవ కేంద్రానికి వెళ్లి అప్లికేషన్ లేదా ఆధార్ నంబర్ ఎంటర్ చేయగానే గతంలో పొందిన ధ్రువపత్రాల సమాచారం కంప్యూటర్లో డిస్‌ప్లే అవుతుంది. అప్పుడు చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేసి 35 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. చిటికెలో క్యాస్ట్, ఇన్‌కమ్ ధ్రువపత్రం మన చేతికి వచ్చేస్తుంది. సమయం ఆదా అవుతుంది.

పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

'జన గణన' ప్రక్రియ షురూ..

నోటిఫికేషన్ జారీ చేసిన హోంశాఖ

16వ జనగణనకు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

దిల్లీ, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): దేశంలో 15 ఏళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు ప్రక్రియ నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైనట్లయ్యింది. మొత్తంగా రెండు దశల్లో జనాభాను లెక్కించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ నాటికి జనగణన పూర్తి కానుంది. "కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూకశ్మీర్, లద్దాఖ్ తో సహా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నాం.

ఇవి కాకుండా దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటిలో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కను పూర్తి చేయనున్నాం" అని హోంమంత్రిత్వ శాఖ ఆ నోటిఫికేషన్లో వెల్లడించింది. ఇది మొత్తంగా 16వ, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన. ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సమాచారణ, సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేపట్టారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని దేశ వ్యాప్తంగా డిమాండ్ పెరగడం, కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి చేయడంతో కుల గణనకూ కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

కనిపించకుండా పోయిన రోజుల వ్యవధిలోనే..

హత్యకు గురైన మోడల్..!

హరియాణాలో మరో యువతి శవమై కనిపించింది. మోడల్గా పనిచేస్తున్న ఆమె దారుణ హత్యకు గురైంది.

హరియాణా, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): హరియాణాలో దారుణం చోటుచేసుకుంది. ఓ మోడల్ను గొంతు కోసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కాలువలో పడేశారు. ఈ ఘటన సోనిపట్లో చోటుచేసుకొంది. ఆమె కనిపించకుండా పోయిన రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యాన్వీ సంగీత పరిశ్రమలో మోడల్గా పనిచేస్తున్నారు. శీతల్. అయితే.. గత కొన్ని రోజులుగా ఈమె కనిపించడం లేదు. దీనిపై ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఆమె ఓ కాలువలో శవమై కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి ఆమెను దారుణంగా హత్య చేసి కాలువలో పడేశారు. కండా గ్రామ సమీపంలో స్వాధీనం చేసుకున్న ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అయితే.. శీతల్ను హత్య చేయడానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. నిందితులు పరారీలో ఉన్నారని వారి ఆచూకీ గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టామని పోలీసులు వెల్లడించారు. ఇదిలాఉండగా.. ఇటీవల పంజాబ్‌కు చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ కంచన్ కుమారి (30) కూడా హత్యకు గురయ్యారు.బఠిండా జిల్లాలోని ఆదేశ్ యూనివర్సిటీ పార్కింగు స్థలంలో విడిచిపెట్టిన కారులో మృతదేహాన్ని గుర్తించారు. 'కమల్ కౌర్ భాబీ' పేరుతో కంచన్కు ఉన్న ఇన్‌స్టాగ్రాం ఖాతాకు 3.84 లక్షలమంది ఫాలోవర్లు ఉన్నారు. 2.36 లక్షల మంది చందాదారులతో 'ఫన్నీ భాబీ టీవీ' అనే యూట్యూబ్ ఛానల్ను కూడా ఈమె నిర్వహిస్తోంది. ఇటీవల ఇంటినుంచి కంచన్ బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఈ క్రమంలోనే స్థానికులు సమాచారం అందించడంతో కారులో ఆమె మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మరో యువతి హత్యకు గురికావడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రంలోని వైద్య కళాశాలలన్నీ పూర్తి

సతులతో పని చేయాలి:సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని సీఎం రేవంత్రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 26 మెడికల్ కళాశాలల్లో సదుపాయాలపై ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసిన జాతీయ వైద్యమండలి.. ఈ నెల 18న దిల్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈని ఆదేశించింది.

ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా వర్చువల్గా హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సమీక్ష నిర్వహించిన సీఎం.. కళాశాలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ వేయాలని ఆదేశించారు. మూడేళ్లలో అన్ని వసతులు సమకూర్చాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అనుమతుల వివరాలు ఇస్తే.. కేంద్ర మంత్రి నడ్డాను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు "నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఆప్షనల్గా నేర్పించాలి. జపాన్లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉంది. ప్రతి నెలా మూడో వారంలో వైద్య, విద్య శాఖలపై సమీక్ష ఉండాలి" అని సీఎం దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, రైతుభరోసా, ఇతర అంశాలపై చర్చించారు.

విశాఖలో యోగా దినోత్సవ

ఏర్పాట్లను పరిశీలించిన సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు.

విశాఖపట్నం, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): సీఎం చంద్రబాబు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. ఈనెల 21అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పర్యటించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సీఎం పరిశీలించారు.

ఆర్కే బీచ్ వద్దకు వెళ్లి జిల్లా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. భారీ ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహిస్తుండటంతో బస్సు నుంచి బీచ్ రోడ్డు వెంబడి ఏర్పాట్లను పరిశీలించారు. వీఐపీల భద్రత తదితర అంశాలపై అధికారులు సీఎంకు వివరించారు. అంతకుముందు విశాఖ చేరుకున్న సీఎం చంద్రబాబుకు పలువురు రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, డోలా బాలవీరాంజనేయస్వామి, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను ఆ దేశాధ్యక్షుడు నికోస్ ప్రదానం చేశారు.

జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ద్వీపదేశమైన సైప్రస్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇక్కడి ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమన్నారు.

రెండు దేశాల సంస్కృతి, సోదరభావం, వసుధైవ కుటుంబకం భావనకు ప్రతీక అని చెప్పారు. ఈ అవార్డును ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ గుర్తింపు ఇరుదేశాల శాంతిభద్రతలు, సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత, శ్రేయస్సుపై పరస్పర నిబద్ధతను మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. భారత్-సైప్రస్ మధ్య ఉన్న క్రియాశీల భాగస్వామ్యం భవిష్యత్తులో కొత్త శిఖరాలను చేరుకుంటుందని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. ఇరుదేశాలు తమ దేశాల పురోగతిని బలోపేతం చేయడమే కాకుండా సురక్షితమైన, శాంతియుత వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడతాయన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. భారత్, సైప్రస్ సంబంధాల్లో గణనీయ ప్రగతికి ఈ పర్యటన దోహదం చేయనుందని.. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులపై మరింతగా కలిసి పనిచేసే అవకాశముంది అని మోదీ పేర్కొన్నారు. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చినా భయపడేది లేదు:కేటీఆర్

తమపై కేసులు పెట్టి విచారణల పేరుతో ఇబ్బంది పెట్టినంత మాత్రాన ప్రశ్నించడం మానుకోబోమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): తమపై కేసులు పెట్టి విచారణల పేరుతో ఇబ్బంది పెట్టినంత మాత్రాన ప్రశ్నించడం మానుకోబోమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నేడు ఏసీబీ విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ పలు వ్యాఖ్యలు చేశారు.

"చట్టాలు, న్యాయస్థానాలపై గౌరవముంది. నిజం నిలకడ మీద తెలుస్తుంది. ఇప్పటికి మూడు సార్లు పిలిచారు.. 30 సార్లు పిలిచినా విచారణకు వస్తా. కేసీఆర్, హరీశ్రావును కాళేశ్వరం కమిషన్ ఎదుట కూర్చోబెట్టి పైశాచిక ఆనందం పొందారు. ఇవాళ నన్ను ఏసీబీ విచారణకు పిలిచి మానసిక ఆనందం పొందుతున్నారు. అరెస్టు కూడా చేయొచ్చు. తెలంగాణ కోసం గతంలో జైలుకు వెళ్లొచ్చాం. మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చినా భయపడేది లేదు. ఒకసారి కాదు.. వంద సార్లయినా జైలుకు వెళ్తాం. కేసీఆర్ లక్షల సైన్యాన్ని టచ్ చేసే ధైర్యం మీకు లేదు. మన ఇద్దరిపైనా ఏసీబీ కేసులు ఉన్నాయి. లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధంగా ఉన్నారా? ఫార్ములా ఈ-రేసు వల్ల తెలంగాణ ఖ్యాతి పెరిగింది. మీ చర్యలతో రాష్ట్రం పరువు పోతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయండి. రైతుబంధు ఎలక్షన్ బంధుగా మార్చారు. కాంగ్రెస్, భాజపా తోడు దొంగలే" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

జైలుకు వెళ్లాలని కేటీఆర్‌కు కుతూహలంగా ఉన్నట్లుంది:సీతక్క

స్థానిక సంస్థల ఎన్నికలకు వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తాను చెప్పలేదని. వారంలోగా స్పష్టత వస్తుందని మాత్రమే చెప్పానని మంత్రి సీతక్క తెలిపారు.

హైదరాబాద్, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలకు వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తాను చెప్పలేదని, వారంలోగా స్పష్టత వస్తుందని మాత్రమే చెప్పానని మంత్రి సీతక్క తెలిపారు. కేబినెట్లో నిర్ణయం తీసుకోకుండా ఎలా చెబుతానని అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. " స్థానిక సంస్థల ఎన్నికలపై ఇవాళ స్పష్టత వస్తుందని భావిస్తున్నాను.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నాయి. బీసీలకు రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ఇవాళ స్పష్టత వస్తుందని భావిస్తున్నా. 66 జైలుకు వెళ్లాలని కేటీఆర్కు కుతూహలంగా ఉన్నట్లుంది. కవిత జైలుకు వెళ్లి రాగానే లిక్కర్ కేసుపై దృష్టి మళ్లించేందుకు బీసీలు, మహిళలు, దళితులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. సానుభూతి కోసమో, లేదంటే ప్రజలను రెచ్చగొట్టేందుకో జైలుకు వెళ్లాలని ఆయన భావిస్తున్నట్లున్నారు. ప్రభుత్వం చట్టప్రకారమే నడుస్తుంది. ఎలాంటి కక్షలు లేవు. ప్రభుత్వం కక్ష సాధింపులకే పాల్పడితే.. ప్రభుత్వం రాగానే వాళ్లను

జైల్లో వేసే వాళ్లం కదా. కక్షలు, కార్పణ్యాలు భారాస వాళ్లకే ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డి పౌరుషంతో మాట్లాడితే.. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారు" అని సీతక్క విమర్శించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1723:** అర్థశాస్త్ర పితామహుడిగా పేరుగాంచిన ఆడం స్మిత్ జననం (మ.1790).
- **1925:** భారత స్వాతంత్రోద్యమ నేత, దేశబంధుగా ప్రసిద్ధి చెందిన చిత్తరంజన్ దాస్ మరణం (జ.1870). (చిత్రంలో)
- **1903:** సుప్రసిద్ధ చిత్రకారులు ఆచంట జానకీరాం జననం (మ.1994).
- **1917:** ప్రముఖ తెలుగు కవి, పండితుడు, అష్టావధాని నముదూరు అప్పలనరసింహం జననం (మ.1986).
- **1944:** బెంగాలీ విద్యావేత్త, ప్రసిద్ధ రసాయన శాస్త్రజ్ఞుడు ప్రఫుల్ల చంద్ర రాయ్ మరణం (జ.1861).
- **1963:** లెఫ్టినెంట్ వాలెంతినా తెరిష్కోవా మొట్టమొదటి మహిళా రోదసీ యాత్రికురాలుగా వోస్టాక్ 6 రోదసీలోనికి ప్రయాణించింది.
- **1994:** భారత దేశ ప్రముఖ గాత్ర కళాకారిణి ఆర్య అంబేద్కర్ జననం.
- **1905:** ప్రముఖ రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి జననం (మ.1965).


ఆడం స్మిత్

చిత్తరంజన్ దాస్

ఆచంట జానకీరాం


ప్రఫుల్ల చంద్రరాయ్

వాలెంతినా తెరిష్కోవా

ఆర్య అంబేద్కర్

మల్లాది రామకృష్ణశాస్త్రి

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఇక రోహిత్ శర్మ సీటు నాదే..

ఎందుకో చెప్పిన కుల్దీప్ యాదవ్

టీమ్ ఇండియా బస్సులో రోహిత్ శర్మ సీటును తానే తీసుకున్నానని కుల్దీప్ యాదవ్ తెలిపాడు. అందుకు గల కారణమేంటో కూడా చెప్పాడు.

ఇంగ్లాండ్ టెస్టు సిరీస్కు ముందే టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ ఈ సుదీర్ఘ ఫార్మాట్కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. దీంతో టీమ్ బస్సులోనూ అతడి సీటు ఖాళీ అయ్యింది. అయితే, ఇప్పుడా సీటులో తాను కూర్చుంటున్నట్లు సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తెలిపాడు. అయితే, రోహిత్ స్థానాన్ని ఆక్రమించుకోవడం తన ఉద్దేశం కాదని, జడేజా పక్కన కూర్చోవడం కోసం ప్లేస్ మారినట్లు చెప్పాడు. "జట్టులో రోహిత్ భాయ్ స్థానాన్ని నేను ఎప్పటికీ తీసుకోలేను. కేవలం బస్సులో అతడి సీట్లో మాత్రం నేను కూర్చుకుంటున్నా. జడ్డూ భాయ్ (రవీంద్ర జడేజా)తో మరింత ఎక్కువ సేపు మాట్లాడేందుకే సీటు మారాను. అశ్విన్ ఇప్పుడు జట్టులో లేనందున.. స్పిన్నర్గా జడేజాతో నేను చర్చించడం చాలా అవసరం. అతడి నుంచి నేను ఎంతో నేర్చుకుంటున్నాను. నా కెరీర్ తొలినాళ్లలో వీరిద్దరితో కలిసి ఆడాను. ఇప్పుడు జడేజా నా స్పిన్ భాగస్వామిగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. దీన్ని నేను ఎంజాయ్ చేస-్తున్నా" అని ఇంగ్లాండ్ సిరీస్కు ముందు ప్రెస్మీట్లో కుల్దీప్ వివరించాడు. ఇంగ్లాండ్ లో ఇప్పటివరకు కులీప్ కేవలం ఒకేఒక్క మ్యాచ్ మాత్రమే ఆడాడు. 2018లో జరిగిన ఆ మ్యాచ్లో 9 ఓవర్లు వేసిన ఈ మణికట్టు స్పిన్నర్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దీంతో విదేశాల్లో అతడికి పెద్దగా అవకాశాలు రాలేదు. తాజాగా అశ్విన్ రిటైర్మెంట్ ఈసారి తుది జట్టులో కుల్దీప్ను తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక, ఇంగ్లాండ్లో లో జడేజా ఇప్పటివరకు 12 టెస్టులకు ప్రాతినిధ్యం వహించాడు. భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్లో భాగంగా తొలి మ్యాచ్ జూన్ 20న లీడ్స్లో మొదలుకానుంది. రోహిత్, విరాట్ కోహ్లి, అశ్విన్ లాంటి సీనియర్లు లేకుండా టీమ్ ఇండియా తలపడబోతోంది. దీంతో తుది జట్టుకూర్పు విషయంలో మేనేజ్మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్కు యువ ఆటగాడు గిల్ సారథిగా బాధ్యతలు అందుకున్నాడు.

మా నాన్న అరటిపళ్లు అమ్మిన ఆ థియేటర్.. : మారుతి ఎమోషనల్ పోస్ట్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహించిన చిత్రం 'ది రాజా సాబ్. ఈ సినిమా టీజర్ విడుదల సందర్భంగా ఆయన తాజాగా ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహించిన చిత్రం 'ది రాజా సాబ్. సోమవారం ఈ సినిమా టీజర్ విడుదల సందర్భంగా మారుతి తాజాగా ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు తన తండ్రి అరటిపళ్లు అమ్మిన ప్రాంతంలో ఇప్పుడు తన కటౌట్ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. జీవితం పరిపూర్ణమైందని అన్నారు."మచిలీపట్నం – సిరి కాంప్లెక్స్ (గతంలో దాని పేరు కృష్ణ కిషోర్ కాంప్లెక్స్). ఒకానొక సమయంలో ఇక్కడే మా నాన్న చిన్న దుకాణం పెట్టుకొని అరటిపళ్లు అమ్మేవారు. సినిమాల్లోకి అడుగుపెట్టాలనే ఆశలతో ఇక్కడ విడుదలైన అందరి హీరోల బ్యానర్లను నేనే సిద్ధం చేసేవాడిని. "ఒక్కసారి మన పేరు కూడా ఇక్కడ చూడాలి" అని కలలు కన్న వారిలో నేనూ ఒకడిని. ఈరోజు అదే కాంప్లెక్స్ వద్ద నిల్చొని నా ప్రయాణం ఎక్కడ మొదలైందో గుర్తు చేసుకుంటే జీవితం పరిపూర్ణమైందనిపిస్తుంది. పాన్ ఇండియా స్టార్ పక్కన నా కటౌట్ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. ఇంతకుమించి ఏం కావాలి?. ఈరోజు మా నాన్న ఉండుంటే ఎంతో గర్వపడేవారు. ఆయన్ని నేనెంతో మిస్ అవుతున్నా. మీ అందరూ నాపై చూపించిన అభిమానానికి థాంక్యూ అనేది చిన్న పదంలా అనిపిస్తుంది. ఉన్న సమయంలోనే మన బాధ్యతలను నెరవేర్చాల్సి ఉంది. నేను ఏవిధంగా మన డార్లింగ్ను చూపించాలని ఆశ పడ్డానో ఆవిధంగా మీ అందరికీ చూపించనున్నా. మీ అందరి ఆశీస్సులు కావాలి" అని మారుతి పేర్కొన్నారు. 'రొమాంటిక్ హారర్ కామెడీ' చిత్రంగా 'ది రాజా సాబ్' సిద్ధమవుతోంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ స్వరాలు అందిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అభిమానులు ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

డైరెక్ట్ ఓటీటీలోకి కీర్తిసురేశ్ కొత్త చిత్రం.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే..?

కీర్తిసురేశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. త్వరలో ఈ సినిమా ఓటీటీలో విడుదల కానుంది.

కీర్తిసురేశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. నటుడు సుహాస్ కీలక పాత్ర పోషించారు. సైకోలాజికల్ కామెడీ డ్రామాగా ఐవీ శశి రూపొందిస్తున్నారు. రాధికా ఎల్ నిర్మిస్తున్నారు. వసంత్ మురళీకృష్ణ మరింగంటి కథని అందించారు. అమెజాన్ ప్రైమ్ ఒరిజినల్ మూవీగా ఇది సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్ను ఓటీటీ సంస్థ ప్రకటించింది. జులై 4 నుంచి ఇది స్ట్రీమింగ్కు అందుబాటులోకి రానుందని చెప్పింది. తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఇది ప్రేక్షకులను అలరించనుంది. ఒక గ్రామం అసాధారణమైన సంక్షోభాన్ని ఎదుర్కోవడం.. అక్కడి ప్రజలు దానిని ఏవిధంగా పరిష్కరించుకుంటారనే కథనంతో ఈ సినిమా సిద్ధమైందని టాక్.

రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

ఆరోగ్యం

నేరేడు పండ్లు తింటే ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. నేరేడు పండ్లు ఎర్రరక్త కణాల ఉత్పత్తికి సాయపడుతుంది. రక్తహీనతను నివారిస్తాయి. అయితే, నేరేడు పండ్లను తినేటప్పుడు లేదా తిన్న తర్వాత కొన్ని ఫుడ్స్ తినకూడదు.

నేరేడు పండ్లు ఈ సీజన్లో ఎక్కువగా దొరికే పండు. ఇది తియ్యగా, పుల్లగా, కొద్దిగా వగరుగా ఉండే ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఈ పండును చాలా మంది ఇష్టంగా తింటుంటారు. నేరేడు పండ్లలో అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. విటమిన్ సి, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి కాకుండా, నేరేడు పండ్లలో ఆంథోసైనిన్లు, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నేరేడు పండ్లు తింటే ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. నేరేడు పండ్లు ఎర్రరక్త కణాల ఉత్పత్తికి సాయపడుతుంది. రక్తహీనతను నివారిస్తాయి. ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, నేరేడు పండ్లను కొన్ని ఆహారాలు కలిపి తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

పాలు, పాల ఉత్పత్తులు

నేరేడు పండ్లు పుల్లగా ఉంటాయి. వీటిలో ఆమ్ల గుణం ఉంటుంది. పాల ఉత్పత్తులతో (పాలు, పెరుగు వంటివి) కలిపి తీసుకోవడం వల్ల పాలు విరిగిపోయి, జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. దీనివల్ల గ్యాస్, అజీర్ణం, కడుపు నొప్పి, మలబద్ధకం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నేరేడు పండ్లు తిన్న తర్వాత కనీసం 30 నిమిషాల నుంచి 1 గంట సమయం గ్యాప్ ఇచ్చి పాల ఉత్పత్తులు తీసుకోవడం మంచిది.

నేరేడు పండ్లతో పాటు లేదా తిన్న తర్వాత కొన్ని ఫుడ్స్ ఎట్టి పరిస్థితుల్లో తినకూడదు, కడుపు మొత్తం ఖరాబ్ అవుతుంది!

నీరు



నేరేడు పండ్లు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల జీర్ణ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్,కొన్నిసార్లు విరేచనాలకు దారితీయవచ్చు. నేరేడు పండ్లు తిన్న తర్వాత కనీసం 30 నుండి 40 నిమిషాల వరకు నీరు తాగకుండా ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

పసుపు, పసుపు కలిపిన ఆహారాలు

నేరేడు పండ్లు, పసుపు రెండింటికి విరుద్ధమైన స్వభావాలు ఉన్నాయని కొందరు నిపుణులు చెబుతారు. వీటిని కలిపి తీసుకోవడం వల్ల కడుపులో అసౌకర్యం, నొప్పి లేదా ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నేరేడు పండు తిన్న తర్వాత పసుపు లేదా పసుపు కలిపిన ఆహారాలను తినడానికి కనీసం అరగంట నుంచి 1 గంట సమయం ఇవ్వడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పచ్చళ్లు

ఊరగాయలలో నూనె, మసాలాలు, పులుపు ఎక్కువగా ఉంటాయి. నేరేడు పండ్లు పుల్లగా ఉంటాయి. కాబట్టి, వీటిని ఊరగాయలతో కలిపి తినడం వల్ల కడుపులో ఆమ్లత్వం పెరిగి, ఎసిడిటీ, గ్యాస్, ఇతర జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇది అజీర్ణం, విరేచనాలకు కూడా దారితీయవచ్చు.నేరేడు పండ్లను ఊరగాయలతో కలిపి తినకుండా ఉండటమే మంచిది. ఒకవేళ తినాలనుకుంటే కనీసం 30 నిమిషాల నుండి 1 గంట గ్యాప్ ఇవ్వండి.

స్వీట్లు

నేరేడు పండ్లు తిన్న వెంటనే స్వీట్లు తినడం వల్ల కడుపులో భారం, ఉబ్బరం లేదా అజీర్ణం వచ్చే అవకాశం ఉందని కొందరు సూచిస్తారు. అందుకే నేరేడు పండ్లతో కలిపి స్వీట్లు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

ఖాళీ కడుపుతో తినకండి

నేరేడు పండ్లు పుల్లగా ఉండటం వల్ల ఖాళీ కడుపుతో తింటే కడుపులో ఆమ్ల స్థాయిలు పెరిగి ఎసిడిటీ, కడుపు నొప్పి, కడుపులో మంట, వికారం, లేదా వాంతులు వచ్చే అవకాశం ఉంది. ఆహారం తిన్న తర్వాత లేదా ఏదైనా తేలికపాటి అల్పాహారం తీసుకున్న తర్వాత నేరేడు పండ్లు తినడం మంచిది. మధ్యాహ్నం లేదా సాయంత్రం సమయంలో తీసుకోవడం ఉత్తమం.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.